"కొరియర్... కొరియర్!"

గుమ్మంలో కొరియరబ్బాయికేక. కొరివితో తల గోక్కుంటున్నట్టుంది విమలకు. పొద్దు పొడుపుతో పోటీ పడుతూ నిద్రలేచి, విసుగూ విరామం లేకుండా గొలుసు పనుల్లో నిమగ్న మైంది. అంతక్రితమే ఇద్దరు పిల్లల్నీ తయారు చేసి వీపుకు పుస్తకాల బస్తాలు, చేతికి టిఫిన్ బాక్సులందించి బడికి పంపించి ఊపిరి పీల్చు



# విముక్తి

కుంది. వంటింట్లో చొరబడి పనులు ప్రారంభించింది. మనో యవనిక మీద గతానుభవ దృశ్యాలు కదలబోతున్నాయి. అప్పుడే కేక... రిపేర్‌కు తయారైన రేడియో శబ్దంలా వినబడింది.

మెగా టౌన్ శివారు అంచుల్లో రెండు చిన్న గదుల అద్దె ఇల్లు... పెద్ద బొమ్మరిల్లులాగుంది. సంసారం సరిగమలకు సంపాదన పదనిసల్ని జోడిస్తూ సరిపెట్టుకోక తప్పదు. పుట్టిన పల్లెటూళ్లో గౌనులేసుకొని బడికెళ్లింది. పక్కూరి హైస్కూలుకు వోణీలేసుకెళ్లి చదువుకుంది. పట్నంలో ఇంటర్ పూర్తయింది కానీ పాసు కాలేదు. మధ్య తరగతి మందహాసం రైతు బిడ్డ యాదయ్యతో మూడుముళ్లు వేయించింది. సినిమాల్లో హీరో హీరోయిన్ల యుగళగీతం దృశ్యాల్లా... పొలం గట్టుమీద, పున్నాగ చెట్టుకింద భర్తతో ఊసులాడుకుంటూ సంసారాన్ని స్వర్గసీమగా మార్చుకోగలననుకుంది. మూడు రాత్రుల ముచ్చటతీరి మూన్నెళ్లు గడవకముందే... స్వేచ్ఛావిహంగం లాంటి విద్యార్థి జీవితానికి, జీవన సమరంలో ఆశల ఆరాటం బలం పుంజుకుంటున్న సంసార జీవితానికీ ఎంతో తేడా ఉందని అర్థమైంది. హతాశురాలై నోరు తెరిచింది.

"కొరియరమ్మా... యాదయ్యపేర కొరియర్!"

తడి చేతుల్ని కొంగుకు తుడుచుకుంటూ బయటికొస్తున్న విమలకు కనబడేట్టుగా కవర్ని గాల్లో ఆడించాడు.

కొరియరెవరు పంపారో? యాదయ్య వెళ్లింది పల్లెటూరుకు. అక్కడ కొరియర్ సౌకర్యం లేదు. అయినా... ఆయన పేర ఆయనే కొరియర్ పంపించుకుంటాడా?... ముసురుకుంటున్న ఆలోచనలతో పాటు ముంగురుల్ని వెనక్కు ఎగదోస్తూ కవరందుకుంది.

"ఇదో... ఇక్కడ సంతకం చెయ్యాలమ్మా!" డెలివరీ స్లిప్, కలం అందించాడు కొరియరబ్బాయి. సంతకం చేయించుకుని సైకిలెక్కి జెట్ విమానంలా దూసుకెళ్తున్న కొరియరబ్బాయిని చూస్తుంటే ఆశ్చర్యమేసింది.

హారిపిడుగా! వేలెడంతలేవు, జానెడంత సైకిల్ నడిపిస్తున్నావా?... అనుకుని ముసిముసిగా నవ్వుకుంది. కవరునటూ, ఇటూ తిప్పి చూసింది. కొంగు బొడ్లో దోపుకొని కుర్చీనాశ్రయించి, కవరు విప్పింది. భర్త యాదయ్య పంజేస్తున్న ప్రైవేట్ కంపెనీ పంపిన శ్రీముఖమది. ఈ నోటీసందిన మూడ్రోజుల్లో డ్యూటీలో చేరకపోతే ఉద్యోగం హుష్కాకైపోతుందని చివరి హెచ్చరిక. పిచ్చెక్కినట్లయింది. జుట్టుపీక్కోవాలన్పించింది. కుడితిలో ఎలుకలాగైపోయింది. నెల రోజుల లీవు మీదెళ్లి ఆర్నెల్లు డ్యూటీ ఎగ్గొడ్తే కంపెనీవాళ్లూరుకుంటారా? కూడ బెట్టుకున్న లీవులు, కూడు పెట్టలేని రోజులూ భారంగా నడుస్తూంటే ఆయనేమో ఊళ్లో... ఏంజేస్తున్నాడో! ఈయనెప్పుడు బాగుపడ్తడో, ఈ సంసా

**ఐతా చంద్రయ్య**

రమెప్పుడు కుదుటబడ్తుందో!

నిన్న భారత్‌బంద్. ప్రచారంలేని ప్రజాసేవ పనిలేని మంగలి పని అన్నట్టుగా ఏ రాజకీయ పార్టీకి ఎలాంటి అవకాశం చిక్కినా పట్టణాల్లో బంద్‌లు, నిరసనర్యాలీలు మామూలైపోయినై. అధికార పక్షం నాయకుడు ప్రతిపక్షనాయకుడిని తిట్టాడట. దానికి కార్యకర్తల నిరసన... బంద్!

బంద్ పిలుపునిచ్చిన వాళ్లకది మజాగానే ఉండొచ్చుగానీ సామాన్యులకు మాత్రం సజా (శిక్ష)నే గదా! రెక్కాడితేగానీ డొక్కాడని శ్రమ జీవులు బిక్కుబిక్కుమంటూ యమయాతన అనుభవించడం సాధారణమైపోయింది.

నిన్న బజారు దుకాణాలతో పాటు బడి కూడా బంద్. పాలుకూడా దొరకలేదు. తాను డికాక్షన్‌తో సరిపెట్టుకుంది. పాలకోసం పాల బుగ్గల పిల్లలిద్దరి ప్రాయోపవేశం ప్రాణాలు తోడేసింది. ఎనిమిదేళ్ల కొడుకు నరేష్ కాళ్లు నేలకు కొడుతూ... "రోజూ పాలుతాగుతాం గదా! ఇప్పుడు గూడా కావాలె" నంటూ ఏడుస్తూ మొండికేశాడు. ఐదేళ్ల కూతురు అనిత మాత్రం తక్కువ తిన్నదా? "అమ్మా! పాలు కావాలెపో!" మారాము చేస్తూ "నాన్నా... నాన్నా... పాలు తే?" అంటూ కేకలేసింది. ఇద్దర్నీ చెరోపక్క కూచోబెట్టుకుని అప్పటికీ "మీనాన్న ఊరునుంచి వస్తడు. మీ కోసం బోలెడన్ని పాలు తెస్తడు. అప్పటిదాకా చెరో చాక్లెట్ తినండి..." ఎంత బుజ్జగించినా ఫలితం చిక్క లేదు.

ఊరి నుంచి వచ్చినప్పుడల్లా ప్లాస్టిక్ సీసాల్లో పాలునింపుకురావడం యాదయ్యకలవాటు. చివరికి... దండోపాయమే మిగిలింది. చెరో



శ్రీ త్యాగరాయగానసభ, హైదరాబాద్‌లో కళా సుబ్బారావు కళావేదికపై కవిసమయం ఆధ్వర్యంలో జరిగిన సభలో నిమ్మల అర్జునగౌడ్ రచించిన 'నా స్పందన కాశ్మీరం' కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న డా॥ సి. నారాయణరెడ్డి. చిత్రంలో కళా వేంకటదీక్షితులు, టి. గౌరీశంకర్, జె. కొమరయ్య యాదవ్, సుధామ, గ్రంథకర్త, జి. రాజేందర్‌రెడ్డి, తాళ్లపల్లి మురళీధరగౌడ్ ఉన్నారు.

చెంపదెబ్బ వడ్డించింది. ఒకరినొకరు చూడ కుండా ఓపిక ఉన్నంతసేపు ఏడ్చి ఊరుకున్నారు. ఛీఛీ... కన్నపిల్లలకు కాసిని పాలుకూడా ఇవ్వలేని బతుకెందుకూ? తనమీద తనకే అసహ్యమేసింది. కడుపులో పేగులు కలబెట్టి నట్టైంది.

ఈ పరిస్థితి ఎందుకొచ్చిందీ? దానిక్కారణ మెవరూ? స్మృతిఫలకమ్మీద గతం నీడలు కదులుతున్నాయి.

భారతమాత గ్రామవాసిని అన్నాడు మహాత్మాగాంధీ. కానీ... పాడిపంటలుంటేనే పల్లెల్లో పచ్చదనం. పచ్చదనం పండాలంటే నీటి వసతి కావాలి. ప్రాజెక్టులులేని తెలంగాణా ప్రాంతంలో వర్షాలుంటేనే నీటివసతి. వరుసగా మూడేళ్ల నుంచి వర్షాలు లేవు. వానలు భూమాతను గిలిగింతలు పెడితే భూమాత కిలకిలా నవ్వుతుంది అని నమ్మే యాదయ్య బిక్కమొహం వేశాడు. కరువుతో ఊరు వల్లకాడైంది.

పత్రికలో ప్రైవేట్‌కంపెనీ వారి ఉద్యోగ ప్రకటన కనబడింది. ప్రాణం లేచొచ్చి యాదయ్యకు చూపించింది. "నీకు పాలిటెక్నిక్ డిప్లొమా ఉంది గదా..." గుర్తు చేసి అప్లై చేయించింది. మొదట అతడు "కన్నవారిని, ఉన్నఊరునీ వదిలిపెట్టాలంటే మనసొప్పడంలేదు విమలా!" అన్నాడు.

నులకమంచమ్మీదున్న అతని భుజంపట్టి "కన్నవారిని, ఉన్నఊరునీ వదిలిపెట్టాలంటే మగ మహారాజులకెందుకంత ఇదో! ఆడవాళ్లు గూడా అట్టానే అనుకుంటే ఎట్టా ఉంటుంది? నిలదీసింది. కూడబెట్టిదేమీ లేకపోయె. మనకున్నది ఐదెకరాలైనా యాభయ్యెకరాలైనా... వర్షాల్లేక పంటల్లేవాయె! అప్పులు చేస్తే తీర్చే తాహతు లేదు. వచ్చేసారి గూడా వానల్లేకపోతే... ఆగమైపోతాము. పొలం అమ్ముదామన్నా ఎవరూ కొనరు. పిల్లలూ మనం పరేషాన్ కావద్దంటే ఉద్యోగం చేసి తీరాలి..." సముదాయించింది.

కల్యాణమొచ్చినా, కక్కొచ్చినా ఆగనట్టే ఉద్యోగమొచ్చి ఊరువిడిచే కాలమొచ్చినా ఎవ్వరూ ఆపలేరు. నెల రోజుల్లో ఇంటర్వ్యూ... వారం రోజుల్లో ఉద్యోగంలో చేరిపోవడం చకచకా జరిగిపోయినై. అది చిరుద్యోగమైనా మెగా టౌనుకు మకాం మార్చక తప్పలేదు. అయినా యాదయ్య అప్పుడప్పుడూ ఊరికెళ్లి వస్తున్నాడు. కుదురుగ్గా ఉద్యోగం చేసుకుంటున్నాడు. నెల జీతాన్ని ఎంత పొదుపుగా వాడుకున్నా చివరి వారంలో చేబదుళ్లు తప్పడం లేదు. గొర్రెతోక జీతం... బంధువులు ఇళ్లల్లో పెళ్లి పేరంటాలు, పిల్లలు చదువులకోసం ఎంతో కొంత అప్పు చేసినా బతుకుబండి కంకర రోడ్డుమీద కాడి జోడెడ్ల బండిలా సాగిపోతోంది. యాదయ్య మనిషిగా పట్నంలో ఉన్నా మనసంతా ఊళ్లో ఉండేదేమో...

"మనూర్లె వానలు పడితే పరిస్థితి ఇట్లా ఉండేదా? హాయిగా పొలం పనులు చేసుకుంటూ దొరలాగుండేవాణ్ని" బాధపడేవాడు.

తానూరుకుందా! "ఇప్పుడు మన పరిస్థితికే మైందనీ?"

"చిరుద్యోగం, ఇరుకు గదుల కిరాయి ఇల్లు. రోజూ యంత్రాల మధ్య పంజేస్తూ యంత్రాన్నై పోయిన. ఈ కృత్రిమ జీవితం ఇంకెన్ని రోజులో..." నిరాశా నిస్పృహలు వెలువడేవి.

ఏందో ఈయన వాలకం!... అని ఎన్నిసార్లు సరిపెట్టుకున్నా ఎప్పుడో ఏదొక విషమ పరిస్థితి తననుగూడా ఆలోచనలో పడేసేది. జీవితమంటే వడ్డించిన విస్తరి కాదు. అది కష్ట సుఖాల కావడి... ఎక్కడో చదివిన విషయం

గుర్తుకొచ్చి భారంగా ఊపిరి పీల్చుకునేది.

పోయిన వర్షాకాలం హర్షాన్ని మోసుకొచ్చింది. వానలు బాగా పడినై. చెరువులు, కుంటలు, బావుల కడుపులు చల్లబడినై. కోతి చేతికి కొబ్బరి చిప్ప దొరికినట్టుందేమో! యాదయ్య సంబరపడిపోతూ నెలరోజుల సెలవు మంజూరు చేయించుకుని ఊరికి ఉడాయించిండు. ఊరికెళ్లేముందు తననుగూడా రమ్మన్నాడు. మళ్లీ పల్లెటూరుకా? వేపకాయ కొరికినట్టనిపించింది.

"ఐదెకరాల పొలాన్ని అమ్మేటందుకు నెలరోజుల లీవు బెట్టివి. అది అమ్మింతర్వాత ఇంకా ఊరితో మనకేంపని!" ధుమధుమలాడింది. పల్లెటూరి బతుకంటే పల్లేరుకాయల మీద నడక... అన్పించింది.

అతని మనసు యాతంబోసిందేమో – "పెద్దలిచ్చిన భూమిని నమ్ముకుంటే నవ్వుల పాలై, తిండికి గతిలేక పస్తులుండాలే. అట్లా కావద్దనే పట్నమొస్తిమి గదా!"

"అప్పుడు కాలం కలిసిరాలేదు."

"ఆహా! లేక లేక లోకయ్యపుడితే లోకం కండ్లు లొట్టవోయినయన్నట్టు ఈసారి మురిపించిన వానలు వచ్చేసారి ఎగబెడితే ఏం చేస్తారటా? ఉన్న ఉద్యోగం సరిగా చేసుకుంటే చాలు. అత్యాశకుపోతే ఆగమైపోతము".

"అరే! మన భూమిని మనం దున్నుకుని మనింట్ల మన ముందుడు అత్యాశనా?"

ఆయనకింకెట్లా చెప్పాలో అర్థం కాలేదు. మెదడుకు పదునుబెట్టి మరోసారి ఆలోచించింది. కాటుక కళ్లను కమ్మగా తిప్పుతూ "మనం ఊర్లె ఉంటే మన పిల్లల చదువులెట్లా? అట్లా కుదరదుగానీ ఈ నెల రోజుల్లో నువ్వే భూమిని అమ్మేసి, కాదంటే కౌలుకిచ్చి వస్తే బాగుంటది గదా!" చివరాస్త్రం వదిలింది.

అది బ్రహ్మాస్త్రంలా పంజేసింది.


అతడు ఆర్నెల్ల నుంచి ఊళ్లోనే ఉంటున్నాడు. డ్యూటీ మాటెత్తకుండా అక్కడనే తిరుగుతున్నడు. పోయిన నెలలో వచ్చినప్పుడు రాత్రికి ఇద్దరూ కలిసి ఫోంచేస్తున్నారు. గట్టిగా మందలించాలన్పించింది. ఎగబడితే బాగుండదు.

"బంగారమసొంటి ఉద్యోగాన్నొదిలిపెట్టి బలాదూర్‌గ ఊర్లె తిరుగుతున్నవు. అక్కడ ప్యాక ఆడుతున్నవా? పాటలు పాడుకుంట పొలాల వెంట తిరుగుతున్నవా?" అనుమానంగా అడిగింది. లోపలి ఆందోళన బయటికి పొక్కవద్దని ఎంత ప్రయత్నించినా కుదరలేదు.

ఆయన సూటిగా కళ్లలోకి చూస్తూ...

"అది నీకు చెప్పినా అర్థంగాదులే" ఓ చిరునవ్వు పారేసాడు. అందులో తాను అమాంతం కరిగిపోయింది.

ఇప్పుడెట్లా...? రెండునెలల ఇంటి కిరాయి ఇవ్వాలి. ఇంట్ల ఉప్పు-పప్పు సరుకులు నిండుకున్నై. ఇంటి యజమాని దెప్పిపొడుపు మాటలు, నిన్న బంద్‌నాడు పిల్లల మొండి అల్లరి, పాత పద్దు కట్టేయాలని కిరాణా షాపాయన తగాదా... ఇవేవీ పట్టించుకోకుండా మా అవస్తలకు మమ్మల్ని వదిలేసి ఆయన ఊర్లె అడ్డా జమాయించుకున్నడు. ఊళ్లో' పేకాట అడ్డాలున్నాయా? పొలం అమ్మి... పైసలు పేకాటల పెడ్తున్నడేమో! లేదా... మరొకతె ఎవతన్నా...! మనసు మైదానం నిండా భయం గుర్రాలు పరిగెడుతున్నె. ఇహ లాభంలేదు... ఈసారి వచ్చినప్పుడు తాడోపేడో తేల్చుకోవాల్సిందే. ఆయన్ను బలవంతంగా కంపెనీకి లాక్కెళ్లి, మానేజర్ను




బతిమాలి ఉద్యోగంలో చేర్పించేస్తేనే బతుకు బాగుపడుతుంది. కానీ... నెత్తిమీద పిడుగులెక్క వచ్చిపడ్డ ఈ నోటీసు సంగతి ఆయనకెట్లా తెలియాలి? రేపు పిల్లల్ని బడికి పంపించి తానే ఊరికెళ్లివస్తే అయ్యగారి బండారం బయటపడు తుంది. మరి... ఊరి నుంచి తిరిగి రావడం ఆలస్యమైతే పిల్లలెక్కడుండాలె? ఛి...ఛీ... అన్నీ సమస్యలే. చుట్టూరా ముళ్లకంప నాటినట్టుంది.

భుజమ్మీద చల్లగా తాకినట్టై ఉలిక్కిపడి లేచి నుంచుంది. వెనక ఉంది యాదయ్య... అవా క్కైంది.

"ఏంది కమలా? అట్లా కూచున్నవేందీ? పిలిచినా పలుకవెందుకూ? ఎటు జూస్తున్నవ్... ఏలోకములున్నవ్? పిల్లలు బడికి పోయింద్రు గదా!" లాలనగా అడిగాడు.

ఉక్రోశం ఉవ్వెత్తున ఉబికొచ్చింది. కోపం కోరలు చాచింది. మొహం మంకెనపూవర్ణ మైంది.

"ఆహాహా! ఇల్లు, ఇల్లాలు, పిల్లలు ఇప్పుడు గుర్తుకొచ్చింద్రా మహారాజా!" వెటకారం పొడు చు కొచ్చింది. పిడికిళ్లు బిగుసుకుపోయినై. నరాల స్వరాలు ఎర్రజీరలై కళ్లల్లో కదలాడు తున్నై.

"అదికాదు విమలా! ఊర్లె పనులంటే మాట లా మజాకా?" పాల సీసాలున్న చేతి సంచిని చిలక్కొయ్యకు తగిలించాడు. "ఎందుకంత ఇదైపోతున్నవ్?" లాలనగా భుజాలందు కున్నాడు. "అప్పుడప్పుడూ వచ్చిపోతున్నగదా!"

తేళ్లూ జెర్రులూ పాకినట్టైంది. అసహనంగా విదిలించింది... పాడా! ఆవారా తిరుగుడా! చచ్చినా బతికినా మాగతి నింతేగదా!" రుసరుస లాడింది.

"అంత కోపమెందుకూ? కోపంలో నువ్వేం మాట్లాడ్తున్నవో, దాని అర్థమేందో నీకర్థమవు తుందా?..." ఆప్యాయంగా చేతులందుకుని, కుర్చీలో కూచోబెట్టాలనుకున్నాడు. ఆ చేతుల్ని

తోసిపారేసింది.

"ఇక్కడి బాధలు నీకేందెల్సునయ్యా?... ఇంకేదేదో దులిపిపారెయ్యాలనుకుంది. కానీ ఆవేశం, ఉక్రోశం దుఃఖంగా పరిణమించి గొంతునడ్డుకున్నాయి. నల్లని కళ్లల్లో తెల్లని నీటి బిందువులు ముత్యాల్లా నేలదాలి మెరుస్తున్నాయి.

"ఏం బాధలు విమలా? అన్నింటికీ నేనున్నాగదా!" చేతిగుడ్డతో కళ్లు అద్ది... గుండెలకు హత్తుకున్నాడు.

హమ్మయ్య! భర్త ఒడి ఎంత హాయి... ఆ హాయికి బండరాళ్లనైనా కరిగించే శక్తి ఉంది.

సంసారసాగరం కష్టసుఖాల ఆటుపోట్ల మయమైందని యాదయ్యకు తెలుసు. ఇల్లాలి సంతోషమే ఇంటికి వెలుగని గూడా తెలుసు. ఇంటి సమస్యల వలయాన్ని ఛేదించాలంటే నేర్పు, ఓర్పు అవసరమని ఆనాడే తెలిసొచ్చింది.

వేదనతో వేడెక్కిన విమల గుండెలకు చల్లని వెన్న రాసినట్టుంది. అంతరాళాల్లో వీచిన మలయమారుత పవనాలు బాధలు, బాదరబందీలను మాయం చేసినై. జీవితాంతం అలాగే ఉండిపోవాలన్పించింది.

"ఇప్పుడు చెప్పు విమలా... సమస్యలేమిటో!" వీపు నిమిరాడు.

గొంతు సవరించుకుంది.

"ఇల్లు గలాయన కిరాయి డబ్బులకోసం తగాదా చేస్తున్నడు. ఇవాళ పొద్దున వచ్చిపోయిండు"

"పాలాయనకు పోయిన నెల బిల్లుగూడా బాకీ..."

"బాకీ... ఇవ్వాలి గదా!"

"కిరాణా దుకాణంల..."

"పాత పద్దు కడితేనేగదా కొత్తగా సరుకు లిచ్చేది..."

"పిల్లల బడిఫీజులు..."

కట్టకపోతే ఉద్దేశ్యమేమిటో! గబుక్కున విడిపోయి కుర్చీలో కూలబడింది. యాదయ్య పక్కన కూర్చున్నాడు.

"సంసారమన్నప్పుడు సమస్యలుండవా? ఏవో కొన్ని బాధలు మామూలేగదా! నువ్వు చదువుకున్నదానివి..." మరోసారి సముదాయించబోయాడు.

"బాధలన్నీ నాకప్పజెప్పి నువ్వేమో పూల రంగనోలె పల్లెటూర్ల తిరుగుతున్నవ్. నువు వెంటనే డ్యూటీకి పోకపోతే ఉద్యోగమూడిపోతుందని ఇయ్యాల్లనే నోటీసు వచ్చింది" కొరియర్ కవరు చేతికిచ్చింది. విప్పి చదివాడు.

"నిజమే... కంపెనీ వాళ్లు మాత్రం నా కోసం ఎన్ని రోజులు ఎదురుచూస్తారు?" ఊపిరి పీల్చుకుని కవరు జేబులోకి తోసుకున్నాడు.

"అన్నీ నిజమేనంటవు కానీ... ఇప్పుడేం చేద్దామనేది చెప్పవుగదా!" నెత్తి కొట్టుకుంది.

"గట్ల నెత్తి కొట్టుకుంటే బాధలు భయపడ్తయా?" చేతులు పట్టుకుని సూటిగా చూశాడు. పొడిబారిన ఇల్లాలి కళ్లు మళ్లీ తడైపోతాయేమో! ఎర్రని కుంకుమ బొట్టు మీద నల్లని ముంగురులు తచ్చాడుతున్నాయి. ముంగురుల వెనక మూడురాళ్ల ముక్కుపుడక త్రివర్ణ పతాకంలా మెరిసింది.

"ఈ బాధలన్నీ డబ్బులతో తీరిపోయేవేగదా విమలా!" ఆమె అరచేతుల్ని తన చెంపల కద్దుకున్నాడు. జేబుల్లోంచి నోట్ల కట్టలు తీసి

చూపించాడు. విమల కళ్లల్లో విచిత్రమైన మెరుపు.

"హమ్మో!" గుండెల మీద చెయ్యేసుకుంది. "ఇంత డబ్బెక్కడిదయ్యా? ఇల్లు అమ్మిన బాపతుదేనా?" ఉచ్ఛ్వాసనిశ్వాసాలు లయతప్పు తున్నై.

"ఇదో... ఇవి దాచిపెట్టు" నోట్లకట్టలు చేతి కందించాడు. మంత్రముగ్ధురాలై చూస్తోంది.

"వానలు పడంగనే ఒక్క నెల లీవుమీద మనూరికి పోయిన గదా విమలా?"

"అవును. అదే మన కొంపముంచింది గదా!" ఆత్రం అధికమైంది.

"మన కొంప మునగలేదు డియర్!"

"అయితే... అమ్ముడు పోయుంటుంది"

"ఓహో... మనమనుకున్నట్టు భూమి అమ్మి నావన్నమాట!" నిట్టూర్చింది.

"నమ్ముకున్న భూమిని అమ్ముకుంటామా?"

"అం...టే!" మళ్లీ గందరగోళం... అయో మయం.

"మనూరోళ్ల సాయంతోని పొలం దున్నిన" యాదయ్య కళ్లల్లో సంతోషం అతని నిజాయితీని చూపిస్తోంది. "చెరువు నీళ్లు అందిన మూడెక రాలల్ల వరినాటు వేయించిన. మిగతా రెండెక రాలల్ల ఉల్లిగడ్డ, మిరపకాయలు, టమాటా విత్తనాలు అతికిన. రాత్రింబగళ్లు కష్టపడి యాతం బోసిన. భూమాత నవ్వింది. మన మీద దయదల్చింది. కాలం కలిసొచ్చింది. పంటలు బాగా పండినై. మన కవసరమున్నన్ని వడ్లు మనింట్ల ఉంచి, మిగతావి ఈ పట్నం మార్కెట్ల అమ్మేసిన. ఉల్లిగడ్డ, మిరప, టమాటలు అంత కుముందే అమ్మేసి ఎరువుల కోసం, కూలీల కోసం చేసిన అప్పులు తీర్చేసిన. ఇగో... ఇది మిగిలిన డబ్బు. ఆర్నెల్ల కష్టానికి అనుకున్నంత ఫలితం..."

భర్త గుండెల మీద గువ్వలా ఒదిగిపో యింది విమల. ●

## సంక్రాంతి రచనల పోటీ

'నమో వేంకటేశ - సపరివార మాస పత్రిక' సంక్రాంతికి రచనల పోటీ నిర్వహి స్తోంది. కవితలు, కథలు, వ్యాసాలు, సంకల నాల విభాగాలలో పోటీలు ఉంటాయి. ప్రతి విభాగంలోనూ అవార్డ్‌తో పాటు రు. 2,000/ - నగదు బహుమతి ఇవ్వబడుతుంది.

కవితలు విభాగంలో 'శ్రీశ్రీ అవార్డు', రు. 2,000/- నగదు; కథల విభాగంలో 'కొడవటి గంటి అవార్డు', రు.2,000/- నగదు; వ్యాసాల విభాగంలో 'నార్ల వెంకటేశ్వరరావు అవార్డు', రు. 2,000/- నగదు; కవితా సంక లనం, కథాసంకలనం విభాగాలలో 'ఉత్తమ అవార్డు'తో పాటు ఒక్కొక్క విభాగంలో రు. 1,000/- నగదు ఇవ్వబడతాయి. ఇవికాక 50 ప్రోత్సాహక బహుమతులు కూడా ఉం టాయి.

రచయితలు ఏ అంశంపైన అయినా, ఏ విభాగంలో అయినా పోటీలో పాల్గొనవచ్చు. అయితే వీటిలో పాల్గొనే వారందరూ 'నమో వేంకటేశ' పత్రిక చందాదారులై ఉండాలి. రచనలు డిసెంబరు 30, 2008 లోపుగా అందాలి. ఇతర వివరాలకు సంపాదకురాలు మొగిలి కృష్ణవేణి గారిని (98850 51921) సంప్రదించవచ్చు.